క్లుప్తంగా

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్షలు



ఆత్మకూర్: నవోదయ కేంద్రియ గురుకులంలో ఆరో తరగతిలో ప్రవేశాల కోసం శనివారం నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. స్థానిక జాతర మైదానం బాలుర ఉన్నతపాఠశాల సెంటర్‌లో 178 మంది విద్యార్థులకు గాను, 150 మంది హాజరైనట్లు ఎంఈఓ కొండాపురం బాలరాజు తెలిపారు. ఎస్ఐ నరేందర్ ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రం వద్ద పోలీసులు గట్టిబందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తి: తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ జోగుళాంబ గద్వాల జిల్లాలో బీసీ నిరుద్యోగ యువతకు ఎస్ఎస్‌సీ, ఆర్‌ఆర్‌బీ, బ్యాంకింగ్ సర్వీసెస్ ఉద్యోగాల కోసం ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ అభివృద్ధి శాఖ అధికారి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోచింగ్ 100రోజుల పాటు ఉంటుందని, డిగ్రీ ఉత్తీర్ణులైన జోగుళాంబ గద్వాల, వనపర్తి జిల్లాల నిరుద్యోగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లోని వారికి రూ.1.50లక్షల లోపు, పట్టణ ప్రాంత వాసులకు రూ.2లక్షల లోపు కలిగి ఉండాలన్నారు. కోచింగ్ కోసం రిజర్వేషన్ ప్రకారం బీసీ విద్యార్థులకు 75 శాతం ఇతర విద్యార్థులకు 25శాతం సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 9వరకు దరఖాస్తు చేసుకోవాలని, అభ్యర్థుల వయస్సు 39ఏళ్ల లోపు ఉండాలని, ఎంపికైన అభ్యర్థులకు ఫిబ్రవరి 15నుంచి తరగతులు ప్రారంభం అవుతాయని తెలిపారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో కోచింగ్ ఇస్తారని, కోచింగ్ అనంతరం స్టడీ మెటీరియల్స్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు ఫోన్ నంబర్స్ 08546 293022, 9985434941 సంప్రదించాలని పేర్కొన్నారు.

రైతు ఆకస్మిక మృతి



వీపనగండ్ల: మండలంలోని వల్లభాపురం తండాకు చెందిన రైతు కాట్రావత్ సోమ్లా (36) శనివారం పంట పొలంలో పనులు చేస్తుండగా మూర్ఛ రావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గతేడాది అతని భార్య కూడా మరణించింది. కుటుంబానికి పెద్ద దిక్కు తండ్రి మరణించడంతో కుమారుడు, కుమార్తెలు అనాథలయ్యారు. ఉన్నతాధికారులు స్పందించి వారి కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

అమరచింత: ఈనెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో సీపీఎం రాష్ట్ర నాలుగో మహాసభలు జరుగుతున్నాయని, ఆ పార్టీ జిల్లా నాయకులు వెంకటేష్, అజయ్‌లు తెలిపారు. మండల కేంద్రంలోని జీఎస్ స్థూపం వద్ద శనివారం మహాసభల వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ ప్రజా సమస్యల కోసం ప్రజల మధ్య ఉంటూ పోరాటాలు చేస్తున్న ఏకైక సీపీఎం అన్నారు. కార్మిక, కర్షకుల సమస్యలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై రాజీలేని పోరాటాలు చేస్తున్నామని తెలిపారు. బహిరంగ సభలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఎన్ రమేష్, బుచ్చన్న, శ్యాంసుందర్, కరుణాకర్, వెంకటేష్, విజయ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలో బీసీ హాస్టల్ రోడ్డు 6వ వార్డులో ఇటీవల వంగూరు లక్ష్మయ్య మృతి చెందాడు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆదేశానుసారం అభయహస్తం కింద రూ.5వేలు బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చీర్ల విజయచందర్, యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కన్వీనర్ నందిమల్ల చంద్రమౌళి శనివారం అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు.

'సింగిల్ విండో'ల నిర్వహణలో నిర్లక్ష్యం



శిథిల భవనంలో కొనసాగుతున్న తూంకుంట సింగిల్‌విండో కార్యాలయం

- మండల వ్యాప్తంగా మూడు సింగిల్‌విండోలు
- శిథిల భవనంలోనే తూంకుంట విండో కార్యకలాపాలు
- 7,200 రైతులు సభ్యులుగా నమోదు
- రూ.15 కోట్ల రుణాల పంపిణీ



గతంలో గోవర్ధనగిరిలో ఉన్న ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం భవనం

వీపనగండ్ల: రైతులను ఆర్థికంగా బలోపేతం చేయాలన్న సదుద్దేశంతో ప్రభుత్వం సింగిల్‌విండోలను ఏర్పాటు చేసి వాటి ద్వారా అన్నదాతలకు కావాల్సిన రుణాలు, ఎరువులు, విత్తనాలు అందజేసేందుకు ఏర్పాటు చేసింది. కానీ మండలంలోని 14 గ్రామ పంచాయతీలను మూడు మండలాల పరిధిలోని సింగిల్‌విండో కార్యాలయాల్లో కలపడం వల్ల ఆయా గ్రామాల రైతులకు సరైన వసతులు, సలహాలు, ఎరువులు అందక నానా ఇబ్బందులకు గురవుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మండల కేంద్రంలో అదనపు సింగిల్‌విండోను ఏర్పాటు చేసి సమీప గ్రామాలను విలీనం చేయాలని రైతులు కోరుతున్నారు.

మూడు విండోల పరిధిలో..

మండలంలోని తూంకుంట సింగిల్‌విండో పరిధిలో కల్వరాల, వీపనగండ్ల, తూంకుంట, సంగినేనిపల్లి, బొల్లారం, వల్లభాపురం, సంపత్‌రావుపల్లి, నాగర్లబండతండా, వల్లభాపురంతండా పంచాయతీలతో పాటు పాన్‌గల్ మండలంలోని రాయిన్‌పల్లి, బుసిరెడ్డిపల్లి గ్రామాలను తూముకుంట విండోలో కలిపారు. పాన్‌గల్ సింగిల్‌విండోలో గోపల్‌దిన్నె, రంగవరం, పుల్గర్‌చర్ల, కొర్లకుంట గ్రామాలను కలిపారు. చిన్నంబావి మండలంలోని కొప్పునూరు సింగిల్‌విండోలో గోవర్ధనగిరిని కలుపడంతో పంట రుణాలు, ఎల్‌టీ రుణాలు తీసుకోవడంలో మండలంలోని రైతులు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారు.

పాత భవనంలోనే..

7,200 మంది సభ్యులు ఉండి ప్రతి యేటా రూ.14 కోట్ల లావాదేవీలు జరిగే తూంకుంట విండో కార్యకలాపాలు శిథిలావస్థ భవనంలోనే కొనసాగుతున్నాయి. 2012 సంవత్సరంలో నూతన భవన నిర్మాణం కోసం రూ.3లక్షలు వెచ్చించి పునాదుల వరకే నిర్మించి వదిలేశారు. అరకొర వసతులు ఉండడంతో ఈ వానాకాలం సీజన్‌లో బొల్లారం, సంగినేనిపల్లి, రాయిన్‌పల్లి గ్రామాల్లోనే ఈ సింగిల్‌విండో ద్వారా వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి అధికారులు చేతులు దులుపుకున్నారు.

గోవర్ధనగిరిలోనే విండో కార్యాలయం..



మా గ్రామంలో ఉన్న సహకార సంఘాన్ని చిన్నంబావి మండలంలోని కొప్పునూరుకు తరలించారు. ఇతర మండలంలోని విండో కార్యాలయంలో మా గ్రామాన్ని చేర్చడం వల్ల రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. పార్టీలకు అతీతంగా రైతులను ఏకం చేసి సింగిల్‌విండో ఏర్పాటు కోసం సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

– చంద్రకళ, మాజీ సర్పంచ్, గోవర్ధనగిరి

అదనపు విండో కోసం సమాచారాన్ని కోరారు



మండలంలోని గ్రామాలు మూడు సింగిల్‌విండోల పరిధిలో ఉన్న మాట వాస్తవమే. రైతుల అవసరాలకు అనుగుణంగా ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న అంశంపై ఉన్నతాధికారులు తమ సింగిల్‌విండో వివరాలను తెలుసుకున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే నూతన భవన నిర్మాణం పూర్తి చేసి రైతుల ఇబ్బందులను తొలగిస్తాం.

– రాము, సింగిల్‌విండో కార్యదర్శి, తూంకుంట

అదనపు సింగిల్‌విండో ఏర్పాటు చేయాలి

రైతుల్లో నెలకొన్న గందరగోళాన్ని నివారించేందుకు వీపనగండ్ల మండల కేంద్రంలో అదనపు సింగిల్‌విండోను ఏర్పాటు చేయాలని మండలంలోని పలు గ్రామాల రైతులు కోరుతుండగా.. 1986 సంవత్సరంలోనే గోవర్ధనగిరిలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఉండేదని, తమ గ్రామంలోని సహకార సంఘాన్ని బలవంతంగా చిన్నంబావి మండలంలోని కొప్పునూరు గ్రామానికి తరలించారని గోవర్ధనగిరి గ్రామస్తులు మండిపడుతున్నారు.

50 పడకల ఆస్పత్రికి ప్రతిపాదనలు

- 21న వైద్యశాఖ మంత్రి రాక
- అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం
- మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి



ప్రభుత్వ ఆస్పత్రిలో డీఎంహెచ్‌ఓతో వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ఆత్మకూర్: ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రి 50 పడకల భవన నిర్మాణానికి అనుమతులు రానున్నాయని, ఈనెల 21 వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్వయంగా ప్రకటించనున్నారని మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. శనివారం ఆత్మకూర్‌లోని ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌ను డీఎంహెచ్ఓ శ్రీనివాస్, టీపీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజుగౌడ్‌లతో కలిసి సందర్శించారు. రూ.3.50 కోట్ల నిధులతో ఇక్కడి ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు 21న వైద్యశాఖ మంత్రి శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. పట్టణ శివారులోని పీజేపీ క్యాంపు వద్ద 50 పడకల నూతన భవన నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించామని, పక్షం రోజుల్లోగా అనుమతులు రానున్నాయన్నారు. నిర్మాణానికి సంబంధించి రూ.18 కోట్లు, మొత్తం రూ.35 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

బహుమతుల ప్రదానం..

ఆత్మకూర్‌లోని బీసీకాలనీలో వారం రోజులుగా సోంసాగర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు ముగిశాయి మొత్తం 29 జట్లు తలపడ్డాయి. మక్తల్ ఎమ్మెల్యే నగదు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి మినీస్టేడియం జట్టుకు రూ.10 వేలు, షీల్డు, రెండో బహుమతి ధర్మఫ్రెండ్స్ జట్టుకు రూ.6 వేలు, షీల్డు అందజేశారు.

డిగ్రీ కళాశాల సమస్యలు పరిష్కరిస్తాం..

ఆత్మకూర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఎమ్మెల్యే సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. కళాశాల ముందు ప్రవేటు వ్యక్తులకు సంబంధించిన స్థలాన్ని రోడ్డు నిర్మాణం కోసం తీసుకుంటామని, అదనపు తరగతిగదుల నిర్మాణం పూర్తి చేయిస్తామని, ప్రహరీ నిర్మాణం చేయిస్తామని ఎమ్మెల్యే హామీనిచ్చారు. కార్యక్రమంలో రహ్మతుల్లా, తులసీరాజ్‌యాదవ్, గంగాధర్‌గౌడ్, రామలక్ష్మారెడ్డి, మణివర్ధన్‌రెడ్డి, గడ్డం శ్రీను, నాగేష్, దామోదర్, సాయిరాఘవ, సుదర్శన్‌శెట్టి, తుకారంనాయక్, శంషీర్, గంగ, తదితరులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి



పాన్‌గల్‌లో తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసులు

పాన్‌గల్: బడీడు పిల్లలు బడిలో ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం 'పిల్లలు బడిలో–పెద్దలు పనిలో' కార్యక్రమాన్ని చేపట్టిందని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. బడిబయట పిల్లల గుర్తింపు కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రం పాన్‌గల్‌లో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. ఆరేళ్ల నుంచి 14 ఏళ్ల లోపు పిల్లలందరిని బడిలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. బడిబయట ఉన్న 2వ తరగతి విద్యార్థిని ఇలియానా, 6వ తరగతి విద్యార్థిని షామీరానును గుర్తించి బడిలో చేర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేష్‌యాదవ్, సీఆర్పీలు గోవింద్‌నాయక్, రమాదేవి, భార్గవి పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి



పాన్‌గల్ మండలం దావాజిపల్లిలో వైద్యంపై అవగాహన కల్పిస్తున్న సీహెచ్ఓ రామయ్య

పాన్‌గల్: గర్భిణులకు క్రమం తప్పకుండా పరీక్షలు, చిన్నారులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్ఓ) రామయ్య సిబ్బందికి సూచించారు. శనివారం మండలంలోని దావాజిపల్లి సబ్‌సెంటర్‌ను ఆకస్మికంగా సందర్శించి గర్భిణుల పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాల తీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గర్భిణులు, చిన్నారుల తల్లిదండ్రులకు వైద్యంపై అవగాహన కల్పించారు. గర్భిణులకు వ్యాక్సినేషన్ తర్వాత ఐరన్ మాత్రలు, క్యాల్షియం మాత్రలు పంపిణీ చేయాలన్నారు. వైద్యుల సూచనలు పాటిస్తూ తీసుకునే ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పాలు, గుడ్లు ఉండాలన్నారు. ప్రతి గర్భిణీ పీహెచ్‌సీలోనే కాన్పులు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శాంతమ్మ, ఏఎన్ఎం రేవతి, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రభుత్వం సంక్షేమానికి కట్టుబడి ఉంది

- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



వనపర్తి క్యాంపు కార్యాలయంలో క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి రూరల్: ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, రైతులకు ఇచ్చిన హామీలు అన్ని అమలు చేస్తామని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. శనివారం వనపర్తి క్యాంపు ఆఫీసులో తెలంగాణ రైతు సంఘం (ఏఐకేఎస్) వనపర్తి జిల్లా కమిటీ 2025 క్యాలెండర్‌ను ఎమ్మెలే ఆవిష్కరించారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని రైతు సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, రైతు సంఘం నాయకులు ఎండీ జబ్బార్, పరమేశ్వరాచారి, బాల్‌రెడ్డి, దేవేందర్ పాల్గొన్నారు.

పోస్టాఫీస్ పథకాలపై విస్తృత ప్రచారం



గోవర్ధనగిరిలో పోస్టల్ బీమాపై ప్రచారం నిర్వహిస్తున్న ఉద్యోగులు

వీపనగండ్ల: భారత ప్రభుత్వ రంగ సంస్థ పోస్టల్ శాఖ ద్వారా ప్రజలకు పలు బీమా పథకాలు అమలవుతున్నాయని, వాటిపై శనివారం మండల కేంద్రంతోపాటు గోవర్ధన్‌గిరిలో పోస్టల్ శాఖ అధికారులు ఇంటింటికి తిరుగుతూ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. సంవత్సరానికి రూ.555లు చెల్లిస్తే రూ.10 లక్షల ప్రమాద బీమా, రూ.755లు చెల్లిస్తే రూ.15 లక్షల బీమా వర్తిస్తుందని అధికారులు తెలిపారు. శాశ్వత అంగవైకల్యం కలిగినా ఈ పథకాల ద్వారా ప్రయోజనం పొందవచ్చని బీపీఎంలు జగదీశ్వర్‌రెడ్డి, జైపాల్‌యాదవ్, అమరేందర్‌రెడ్డి, ఏబీఎం నందిని తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను అందజేస్తున్న గోవర్ధన్‌సాగర్

పాన్‌గల్: మండలంలోని మాందాపూర్ గ్రామానికి చెందిన ముగ్గురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్‌సాగర్ పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన వారాలరాములుకు రూ.60 వేలు, బొక్కెం బాలస్వామికి రూ.10 వేలు, చిన్నపాగ కుర్మయ్యకు రూ.9వేలు చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయనిధి నిధులతో పేద ప్రజలకు కార్పొరేటు స్థాయి ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకోగలుగుతున్నారన్నారు. చెక్కులు మంజూరు చేయించిన మంత్రి జూపల్లికి, మంజూరుకు కృషి చేసిన కాంగ్రెస్ నాయకులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు జయరాములుసాగర్, కృష్ణయ్యసాగర్, దయాకర్, రాజు, కుర్మయ్య పాల్గొన్నారు.

పాఠశాల సంపు మోటార్ అపహరణ

ఎర్రవల్లి: మండల పరిధిలోని దువాసిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలోని సంపు మోటార్ అపహరణకు గురైంది. పాఠశాల అవసరాల కోసం గతంలో సంపు ఏర్పాటు చేసి అక్కడి నుంచి పాఠశాల భవనంపై ఉన్న ట్యాంకులోకి నీటిని పంపింగ్ చేసేందుకు మోటర్‌ను ఏర్పాటు చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్ తెలిపారు. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు పాఠశాల దగ్గరకు వచ్చి విద్యుత్ వైర్ కత్తిరించి మోటార్‌ను అపహరించుకు పోయినట్లు తెలిపారు. ఉదయం పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు గుర్తించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి



కల్వరాలలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

వనపర్తి రూరల్: మండలంలోని అచ్యుతాపురం గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ నాయకులు మాజీ జెడ్పీటీసీ సభ్యులు వెంకటయ్య యాదవ్ ఎన్టీ రామరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

- వీపనగండ్ల మండలంలోని పలు గ్రామాల్లో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ చిత్రపటానికి కల్వరాల గ్రామంలో టీడీపీ నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో బుచ్చారెడ్డి, పలవరి వెంకటేశ్వర్లు, శ్రీను, రామచంద్రయ్య, నర్సింహ, బాలవెంకటయ్య, కృష్ణయ్య, పాల్గొన్నారు.
- ఆత్మకూర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించి, అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దివాన్జీ అశోక్‌రావు, కట్టెల మండి రాములు, శ్రీనివాసరావ్ పాల్గొన్నారు.
- అమరచింత మండల కేంద్రంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మనోహర్ రాజు, గోపాల్ యాదవ్, మచ్చందర్, కమ్రుద్దీన్ ఉన్నారు.

ఉత్సవాలకు వేళాయే..

- 21 నుంచి మస్తీపురం హాజీమాలంగ్ బాబా ఉర్సు
- ఏర్పాట్లు పూర్తి చేస్తున్న నిర్వాహకులు



అమరచింత: ఆహ్లాదకరమైన గుట్టలపై వెలసిన శ్రీ సయ్యద్ షా హాజీమాలంగ్ బాబా ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు దర్గా పరిసరాలను సుందరీకరణ చేసే పనుల్లో నిర్వాహకులు నిమగ్నమయ్యారు. ఎంతో మహిమలు కలిగిన హాజీమాలంగ్ బాబా దర్గా షరీఫ్‌ను దర్శించుకునేందుకు రాష్ట్ర ప్రజలే కాక, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చి కందూర్ చేయడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ. ఈనెల 21 నుంచి 23 వరకు మస్తీపురం గుట్టలో వెలసిన శ్రీ సయ్యద్‌షా హజ్రత్ హాజీ మలాంగ్ బాబా ఉర్సు ప్రారంభమవుతుందని ముర్షద్ మైనొద్దీన్ తెలిపారు. 21న గంధోత్సవం, 22న ఉర్సు, 23న ఫాతేహా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా దర్గా వద్ద నిర్వాహణ కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డుప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు



ఆత్మకూర్: ద్విచక్రవాహనం అదుపుతప్పి పడిపోవడంతో ముగ్గురికి తీవ్ర గాయాలై, ఒకరి పరిస్థితి విషమంగా మారిన సంఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు.. ప్రకాశం జిల్లాకు చెందిన చినబాబు, రామసుబ్బయ్య, తిరుపతయ్యలు చెరుకు కొట్టేందుకు అమరచింతకు వచ్చారు. శనివారం రాత్రి 9:30 గంటల సమయంలో అమరచింత నుంచి చినకడ్మూర్‌కు బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో బైక్ అదుపుతప్పి కింద పడడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. దీన్ని గమనించిన ప్రయాణికులు 108కు సమాచారం అందించి ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చినబాబు తలకు తీవ్ర గాయాలుకావడంతో మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

వ్యవసాయేతర భూముల పరిశీలన



ఎర్రవల్లి: మండల పరిధిలోని వివిధ గ్రామాలను శనివారం రెవెన్యూ, వ్యవసాయ అధికారులు సందర్శించి వ్యవసాయేతర భూములు పరిశీలించారు. జిల్లా వ్యవసాయ అధికారి సక్రియానాయక్, తహసీల్దార్ నరేష్ మండలంలోని బీచుపల్లి, తిమ్మాపురం గ్రామాలను సందర్శించారు. పట్టా పాసుపుస్తకం గల కల్లందొడ్లు, చెరువులు, నాలా కన్వర్షన్, అనధికార లేఅవుట్ భూములు పరిశీలించి నమోదు చేశారు. ఏఓ రవికుమార్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఏఈఓలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు బుక్స్ అందజేత



కొత్తకోటలో అంగన్‌వాడీ టీచర్లకు ఫ్రీ స్కూల్ బుక్స్‌ను అందజేస్తున్న సీడీపీఓ లక్ష్మమ్మ

కొత్తకోట రూరల్: పట్టణంలోని 2వ అంగన్‌వాడీ కేంద్రంలో కొత్తకోట సెక్టార్‌లోని అంగన్‌వాడీ టీచర్లకు సీడీపీఓ లక్ష్మమ్మ శనివారం ప్రీ స్కూల్(ప్రియదర్శిని)బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ బుక్స్ అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు మొదటి బుక్, జనవరి నుంచి ఏప్రిల్ వరకు రెండో బుక్‌ను అంగన్‌వాడీ టీచర్లు అనుసరిస్తూ విద్యాబోధన చేయాలన్నారు. ఈ బుక్స్‌లో పొందుపర్చిన విధంగా అంగన్‌వాడీ చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యను అందించనున్నట్లు తెలిపారు. అనంతరం అక్కడి నుంచి రామనంతాపురం గ్రామంలో అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. 6 నెలలు నిండిన చిన్నారులకు తల్లిపాలతో పాటు జావ, మెత్తటి బాలామృతం తినిపించా లన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్స్ సబిత, భారతి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పొలికెపాడులో ఎన్ఎస్ఎస్ క్యాంపు



సత్యశీలారెడ్డిని సన్మానిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

గోపాల్‌పేట: మండలంలోని పొలికెపాడులో శనివారం ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో కొంత మందికి రక్త నమూనాలు సేకరించి పరీక్షలు చేశారు. పెద్దమొత్తంలో షుగర్ ఉన్నట్లు తేలిందని వైద్యులు తెలిపారు. రాజా బహదూర్ వెంకట్రామిరెడ్డి కళాశాలకు చెందిన బీ ఫార్మసీ విద్యార్థులు రెండు రోజులుగా పొలికెపాడులో ఎన్ఎస్ఎస్ క్యాంపు నిర్వహిస్తున్నారు. వైద్య పరీక్షలు నిర్వహించేందుకు సహకరించిన కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి మండలాల ఇన్‌చార్జి సత్యశీలారెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ సహకరించారని కొనియాడారు. కళాశాల తరుపున వారికి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలి



ఖిల్లాఘనపురంలో శివకరణ్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

ఖిల్లాఘనపురం: దేశంలో సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జాతీయ ప్రచారక్ పేట్రియాట్ చీఫ్ శివసేవక్ శివకరణ్ అన్నారు. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలోని పత్తేపూర్ జిల్లాకు చెందిన ఆయన పాదయాత్ర చేస్తూ శనివారం ఖిల్లాఘనపురం చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సనాతన ధర్మాన్ని కాపాడటంతో పాటుగా స్వాతంత్ర్య సమరయోధుల ప్రాముఖ్యతను వివరించడం, పర్యావరణ సమతుల్యతను కాపాడటం, యువత వ్యసనాలు తది తర చెడుదారులకు వెళ్లకుండా అవగాహన కల్పించడం కోసం జమ్ముకాశ్మీర్ నుంచి కన్యాకుమారి వర కు పాదయాత్ర చేపట్టడం జరిగిందన్నారు. కన్యాకుమారి నుంచి ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళకు పాదయాత్ర చేస్తూ దారిలో వచ్చే గ్రామా ల్లో ఈ అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అంతకు ముందు ఖిల్లాఘనపురం గ్రామానికి వచ్చిన ఆయనకు గ్రామస్తులు స్వాగతం పలికారు. శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు శ్రీనువాసులు, భాస్కర్, నాగరాజు, ఆంజనేయులు, యువకులు పాల్గొన్నారు.